క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలలో చేరండి

బాడంగి: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్మీడియట్ చదివేందుకు స్థానిక ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రిన్సిపాల్ సీహెచ్ విజయకుమారి ఓ ప్రకటనలో గురువారం కోరారు. కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంతో పాటు ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయని, వాటిల్లో మొత్తం 160 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీ వరకు తొలి విడత ప్రవేశాలు జరుగుతాయని, విద్యార్థులు త్వరగా కళాశాలను సంప్రదించి, ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బీసీజీ టీకా వేసుకోవాలి



పెనుబాకలో అడల్ట్ బీసీజీ టీకా వేయించుకుంటున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: టీబీ వ్యాధి నిర్మూలనలో భాగంగా వైద్యారోగ్య శాఖ నిర్వహిస్తున్న అడల్ట్ బీసీజీ(బీపీ) టీకా అందరూ వేసుకోవాలని జెడ్పీటీసీ బండి నర్సింహులు కోరారు. మండలంలోని పెనుబాక గ్రామంలో వైద్య సిబ్బంది గురువారం చేపట్టిన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, టీకాను ఆయన వేసుకోవడంతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు కూడా వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుట్టిన పిల్లలతో పాటు పెద్దలకు కూడా బీసీజీ టీకా వేసుకోవడం చాలా సురక్షితమన్నారు. అడల్ట్ బీసీజీ టీకా వేయించుకోవడం ద్వారా టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. గత ఐదేళ్లకు ముందు టీబీ వచ్చి తగ్గిన వాళ్లు, 18 ఏళ్ల వయసు నిండినవాళ్లు, స్మోకింగ్, డ్రింకింగ్ అలవాటు ఉన్న వాళ్లు, టీబీ పేషెట్లతో దగ్గర సంబంధాలు ఉన్నవాళ్లంతా ఈ అడల్ట్ బీసీజీ టీకా వేయించుకోవచ్చన్నారు. ప్రస్తుతం టీబీ మందులు వాడుతున్నవారు, గర్భిణులు, బాలింతలు, హెచ్ఐవీ బాధితులు, టీబీ ప్రివెంటివ్ ట్రీట్‌మెంట్ పొందుతున్న వాళ్లు, జ్వరం, దగ్గున్న వారు, కిడ్నీ, లివర్ సమస్యలు ఉన్నవారు, 18 ఏళ్ల లోపువారు, రక్తదానం చేసి మూడు నెలలు దాటని వారు ఈ టీకాను వేయించుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జి.యోగీశ్వరి, ఎమ్ఎల్‌హెచ్‌పీ వై.దేవమణి తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే బిల్లులు సమర్పించండి



మాట్లాడుతున్న పీఆర్ డీఈఈ అప్పారావు

బాడంగి: ప్రభుత్వ భవన నిర్మాణాలకు సంబంధించిన ఫైనల్ బిల్లులను తక్షణమే సమర్పించాలని, నిధులు మంజూరు చేస్తామని పీఆర్ డీఈఈ సీహెచ్ అప్పారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశమైన ఆయన.. మండలంలో దాదాపు 37 వరకు సచివాలయ, ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్ భవన నిర్మాణాలను పూర్తి చేసి, ప్రభుత్వానికి అప్పగించడం, వాటి ప్రారంభోత్సవాలు కూడా జరిగిపోవడం జరిగిపోయాయన్నారు. అయితే వాటిలో 30 భవనాలకు సంబంధించిన ఫైనల్ బిల్లులను ఎన్నికల కోడ్ కారణంగా సమర్పించలేదని, సోమవారం నాటికి వాటిని కార్యాలయానికి అందజేయాలన్నారు. సమావేశంలో పీఆర్ జేఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సీసీ కాలువల నిర్మాణం



జన్నివలసలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ కాలువలు

తెర్లాం: మండలంలోని కూనాయవలస, జన్నివలస గ్రామాల్లో సీసీ కాలువల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షల నిధులతో ఆయా నిర్మాణాలు జరుగుతున్నాయి. బొబ్బిలి ఏఎంసీ చైర్మన్, కూనాయవలస ఎంపీటీసీ బొమ్మి శ్రీనివాసరావు, సర్పంచ్ బోడెల విజయబాబుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనులను పంచాయతీ కార్యదర్శి ఎంఏ స్వామి పర్యవేక్షిస్తున్నారు. జన్నివలస బీసీ కాలనీలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా రూ.12 లక్షల వ్యయంతో.. కూనాయవలసలో ఎస్టీ వీధి నుంచి ఎస్సీ వీధి వరకు మరో రూ.8 లక్షల వ్యయంతో నిర్మాణాలు చేస్తున్నారు.

ప్రాంగణ నియామకాల్లో 59 మంది ఎంపిక

చీపురుపల్లిరూరల్(గరివిడి): నెల్లూరు శ్రీసిటీకి చెందిన ఏసీ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు ఈ-పాక్, డైకిన్ ఆధ్వర్యంలో గరివిడి అవంతి సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కళాశాలలోని అన్ని విభాగాల డిప్లమా విద్యార్థులు 107 మంది రాత పరీక్ష, ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 59 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా జయప్రసాద్ తెలిపారు. ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, కళాశాల ఏఓ అనిల్ కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.చంద్రశేఖర్, ఈ-పాక్, డైకిన్ కంపెనీల హెచ్ఆర్ బృందం జి.చిట్టిబాబు,డి.ఆర్.ఎం పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

రానున్నది మన ప్రభుత్వమే

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బొబ్బిలి:మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: రానున్నది మళ్లీ మన వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజలు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలిచారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బొబ్బిలి నియోజకవర్గంలోని తెర్లాం, బాడంగి, బొబ్బిలి, రామభద్రపురం మండలాల నాయకులతో గురువారం సమావేశమైన ఆయన.. ఎన్నికల నిర్వహణ, పోలింగ్ సరళి, ఎన్నికల ఫలితాలు, ఓటింగ్ విధానం, పోలింగ్ శాతం తదితర అంశాలపై చర్చించారు. ఏ మండలంలోని ఏ గ్రామం నుంచి వైఎస్సార్ సీపీకి అధికంగా ఓట్లు పడ్డాయన్న విషయాన్ని కూడా నాయకులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో మళ్లీ సంక్షేమ ప్రభుత్వాన్ని స్థాపించేందుకు ప్రజలు ఎంతో ఉత్సాహంతో ఓట్లు వేశారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, బొబ్బిలిలో తాను మరోసారి విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి కారణమైన నాయకులు, అధికారులు, ప్రజలు, ఓటర్లకు కృతజ్ఞతలన్నారు. మన ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇప్పుడున్న సంక్షేమం, అభివృద్ధిని రెట్టింపు చేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా ధైర్యంగా ఉండాలని, జూన్ 4న విడుదలయ్యే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగిస్తుందని జోష్యం చెప్పారు. సమావేశంలో జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు, కొప్పుల వెలమ సంఘం నాయకుడు బలగ సాయికృష్ణ, తెర్లాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనే మళ్లీ ముఖ్యమంత్రి

రాజాం సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ జోష్యం చెప్పారు. స్థానిక పట్టణంలోని వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు ఇంట్లో పార్టీ నాయకులతో ఆయన గురువారం సమావేశమై, ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికలు, ఓటింగ్ విధానం, పోలింగ్ సరళి, పోలింగ్ శాతం తదితర అంశాలపై సమీక్షించారు. ప్రధానంగా పట్టణంలో వార్డుల వారీగా జరిగిన పోలింగ్ వివరాలపై ఆరాతీశారు. అలాగే ఏ గ్రామంలో వైఎస్సార్ సీపీకి ఎక్కువ ఓట్లు పడొచ్చన్న దానిపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈసారి కూడా వచ్చేది మన వైఎస్సార్ సీపీ ప్రభుతమేనని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ నాయకులు పాలవలస శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాలనాయుడు, ఆశపు సూర్యం, కాలెపు చంద్రశేఖర్, రెడ్డి రమేష్, పాలవలస శ్యాంసుందర్, ఓలేటి గణపతి, సప్పటి పెంటయ్య, బగ్గు హరనాథరావు, జె.ఈశ్వర్, జి.బాబూరావు, ఎం.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



రాజాం సిటీ: వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ నాయకులతో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

జాబ్‌కార్డు ఉన్నవారికే పనులకు అనుమతి

రేగిడి: జాబ్‌కార్డు ఉన్న వారికే ఉపాధి హామీ పథకం పనులకు అనుమతించాలని ఏపీవో ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని మునకలవలస గ్రామంలో డోల పారమ్మ చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. పనులకు వచ్చే వారికి మాత్రమే మస్తరు వేయాలని, తప్పుడు మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా రోజుకు రెండుపూటలా చల్లగా ఉన్న సమయంలోనే పనులు చేయాలని తెలిపారు.

రాజాం: మండలంలోని కొఠారిపురం, గార్రాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఏపీవో సాయిరాంలు గురువారం పరిశీలించారు. అనంతరం వేతనదారుల మస్తర్లపై ఆరా తీశారు. జాబ్ కార్డు ఉన్నవారికి మాత్రమే పనులు కల్పించాలని, ఎండ బారినపడకుండా పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

బొబ్బిలి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తేనే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఏపీడీ కె.జనార్దనరావు తెలిపారు. మండలంలోని గొంగాడవలస, చింతాడ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన గురువారం పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రోజుకు రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో పనులు చేయాలని, పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.



బొబ్బిలి: చింతాడలో వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీడీ జనార్దనరావు



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

వంగర: విద్యార్థులంతా క్రమశిక్షణ అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వంగర స్టేట్‌బ్యాంక్ బ్రాంచి మేనేజర్ కె.కృష్ణారావు అన్నారు. స్థానిక వివేక్ మాస్టర్‌మైండ్స్ హైస్కూల్‌లో ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు పాలిసెట్, ఏపీఆర్‌జేసీ, ఎంజేపీ టీసీడబ్ల్యూఆర్ఐఈఎస్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాగా చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించారని, వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం ఇదే పాఠశాలలో చదివి సీఏ పూర్తి చేసిన పూర్వ విద్యార్థి మజ్జి పవన్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కనగల పద్మ, ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

రామభద్రపురం: క్షయవ్యాధి నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని రామభద్రపురం, ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష, రత్నదీపక్, అపర్ణ అన్నారు. గురువారం మండలంలోని ఆయా పీహెచ్‌సీల్లో వారి ఆధ్వర్యంలో పలువురికి క్షయ వ్యాధి నిర్మూలన టీకాలు వేశారు. క్షయవ్యాధి వ్యాప్తి చెందకుండా వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోందన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో అవలంభించిన ట్రేసింగ్, టెస్టింగ్, ట్రీట్‌మెంట్ విధానాన్నే క్షయవ్యాధి నియంత్రణకు కూడా ప్రభుత్వం వినియోగిస్తోందన్నారు. టీబీ(క్షయవ్యాధి) బారిన పడే వ్యక్తులను గుర్తించి, వారికి వ్యాధి నిర్మూలన టీకాలు వేస్తున్నామన్నారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, టీబీతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులు, ధూమపానం చేసేవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు టీకాలు వేయిస్తున్నామన్నారు. 3 నెలల వరకు ప్రతీ వారానికి ఒకరోజు టీకాలు వేసే కార్యక్రమం ఉంటుందన్నారు. టీబీతో బాధపడేవారు ఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆరికతోట పీహెచ్‌సీలో క్షయవ్యాధి నిర్మూలన టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు వరం

రామభద్రపురం: హైస్కూల్ ప్లస్ పేరిట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయడమనేది పేద విద్యార్థులకు వరమని ఎంఈవో తిరుమలప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడంతో ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావును గురువారం కలిసిన ఆయన.. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులకు పేద విద్యార్థులు దూరం కాకూడదన్న సదుద్దేశ్యంతోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలు లేని మండలాల్లో ఎక్కువ మంది పిల్లలు ఉన్న ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్ పేరుతో జూనియర్ కళాశాలలుగా ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించబడతాయన్నారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆయన కలిసి ఆయా పాఠశాలల విద్యార్థులు కళాశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్యతో పాటు ఉన్నత విలువలు, సంస్కారం, సంస్కృతీ సంప్రదాయాలు నేర్పిస్తారన్నారు. ఒక్కొక్క జూనియర్ కళాశాలలో ఒక్కొక్క గ్రూపులో 40 మంది విద్యార్థులు చేరేందుకు అవకాశం ఉందన్నారు. ఇక్కడ ఎంపీసీ, సీఈసీ గ్రూపులను ప్రారంభిస్తున్నామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి, తరగతులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇక నుంచి ఏవీపురంలో ఇంటర్మీడియట్..

రేగిడి: మండలంలోని ఏవీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ పేరుతో జూనియర్ కళాశాల తరగతులు నిర్వహిస్తున్నట్లు బొబ్బిలి డిప్యూటీ డీఈవో కలిగట్ల మోహనరావు తెలిపారు. గురువారం ఏవీపురం పాఠశాలను సందర్శించిన ఆయన.. 2024-25 ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎంవీ ప్రసాదరావు, ఎంఈవో-2 బి.ఎరకయ్య తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: ఏవీపురంలో ఇంటర్మీడియట్ తరగతులపై చర్చిస్తున్న డిప్యూటీ డీఈవో మోహనరావు



రామభద్రపురం: ఇంటర్మీడియట్ ప్రవేశ దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంఈవో తిరుమలప్రసాద్

ప్రజలందరికీ కృతజ్ఞతలు



లక్ష్మీపురం గ్రామస్తులతో ముచ్చటిస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రేగిడి: ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గురువారం పర్యటించిన ఆయన అక్కడి గ్రామస్తులతో కాసేపు ముచ్చటించారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేశారని, సీఎం జగనన్నపై ఎంతో నమ్మకంతో నాకు ఓటు వేసిన వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, మరింత అభివృద్ధి, సంక్షేమం అందిస్తామన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వచ్చేంత వరకు సంయమనం పాటించాలని, గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.వెంకటేశ్వరరరావు, ఎంపీటీసీ ఎ.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల పర్యటన

రేగిడి: ఎన్నికల నేపథ్యంలో మండలంలో గుర్తించిన పలు సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు పర్యటిస్తున్నారు. ఈ నెల 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరగడంతో కొన్నిచోట్ల ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య ఎన్నికలకు సంబంధించిన తగాదాలు చోటుచేసుకుంటుండడంతో పోలీసులు గ్రామాలను సందర్శించి, గొడవలు జరగకుండా చూస్తున్నారు. మండలంలోని అంబఖండి, సోమరాజుపేట, కాగితాపల్లి, కొండవలస తదితర గ్రామాల్లో గురువారం పర్యటించిన ఎస్ఐ శ్రీనివాసరావు.. గ్రామాల్లో శాంతియుత వాతావరణానికి ప్రజలంతా సహకరించాలని కోరారు.

ఘనంగా ఎల్లమ్మ సంబరాలు



సంతకవిటి: ఆకట్టుకున్న తప్పెటగుళ్లు కళాకారుల విన్యాసం

సంతకవిటి: మండలంలోని రంగారాయపురం గ్రామంలో ఎల్లమ్మ సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి అమ్మవారికి మనువు చెల్లించారు. గురువారం ఉదయం ప్రత్యేక పూజలు చేసి, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో కోరాడ కుటుంబీకుల ఇలవేల్పు సత్తెమ్మ సంబరాలు గురువారం వైభవంగా నిర్వహించారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ప్రాంతాల్లోని తదితర ప్రాంతాల్లోని కోరాడ వంశీకులంతా ఈ వేడుకలకు హాజరై, అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

అవగాహనతోనే డెంగీ వ్యాధి నివారణ



రేగిడి: ర్యాలీలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది

రాజాం: అవగాహనతోనే డెంగీ వ్యాధి నివారణ సాధ్యమని, వ్యాధి వచ్చే విధానం, వ్యాధి రాకుండా అనుసరించాల్సిన పద్ధతులపై ప్రజలను చైతన్యం చేయాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారులు నరేంద్ర, సిద్ధేశ్వరి తెలిపారు. జాతీయ డెంగీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని బొద్దాం గ్రామంలో అవగాహన ర్యాలీ గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య సిబ్బంది వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తాగి వదిలేసిన కొబ్బరిబోండాలు, వాహనాల టైర్లు, ప్లాస్టిక్ డొక్కులు వంటివి ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలన్నారు. మురుగు, నీటి నిల్వల్లో డెంగీతో పాటు వివిధ రకాల విషజ్వరాలు వ్యాప్తి చెందే దోమలు ఉత్పత్తి అవుతాయని, ఈ నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో అవేవీ లేకుండా చూసుకోవాలన్నారు.

రేగిడి: జాతీయ డెంగీ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆమదాలవలస, రేగిడి గ్రామాల్లో అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు మాట్లాడుతూ దోమల కారణంగా వచ్చే డెంగీ వ్యాధి రాకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సోహినీరాఘవ్, సీహెచ్‌వో సుందరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో డెంగీ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!



తెర్లాం: శాఖా గ్రంథాలయం వద్ద విద్యార్థులతో కబడ్డీ ఆడిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

రామభద్రపురం: ప్రభుత్వ శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం జరిగిన తరగతులకు హాజరైనన విద్యార్థులకు మంచి అలవాట్లపై అవగాహన కల్పించి, అనంతరం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు చెడు తిరుగులు, అలవాట్లకు బానిస కాకుండా ఈ శిక్షణా తరగతులు దోహదపడుతున్నాయని, కథలు చదవడం, వినడం, చెప్పించడం, చిత్రలేఖనం, వక్తృత్వం, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి వాటిని విద్యార్థులకు నేర్పిస్తున్నామని గ్రంథాలయ నిర్వాహకురాలు సత్యవాణి తెలిపారు.

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. జూన్ 7వ తేదీ వరకు జరిగే ఈ తరగతుల్లో ఆటపాటలతో కూడిన విద్య, విజ్ఞానం పంచే ఎన్నో విషయాలను నేర్పించడం జరుగుతుందని లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ తెలిపారు.

తెర్లాం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గ్రంథాలయానికి గురువారం విచ్చేసిన విద్యార్థుల మధ్య క్రీడాపోటీలు నిర్వహించారు. చదువుతో పాటు ఆటపాటల్లోనూ విద్యార్థులు బాగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా కలుగుతుందన్నారు. రోజులో కనీసం గంటకాలం పాటు ఆటలకు విద్యార్థులు సమయం కేటాయించాలన్నారు.



రామభద్రపురం: విద్యార్థులతో కథల పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ సత్యవాణి

ప్రశాంతంగా ఏపీఈఏపీసెట్

రాజాం: స్థానిక జీఎంఆర్ ఐటీ కళాశాలలో ఏపీఈఏపీ సెట్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 304 మంది విద్యా ర్థులకు గాను 284 మంది పరీక్షకు హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సీఎల్‌వీఆర్ ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 300 మంది విద్యార్థులకు గాను 280 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.